క్లుప్తంగా

కోదండరామాలయానికి ఏళ్ల చరిత్ర



మాట్లాడుతున్న అధికారులు

కోవూరు : మండల కేంద్రంలోని గాంధీ పార్కు సెంటర్‌లో ఉన్న కోదండరామస్వామి దేవస్థానం ఏళ్ల చరిత్ర కలిగి ఉందని, దీనిని చోళరాజులు నిర్మించినట్లు శాశనాలు తెలియజేస్తున్నట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య తెలిపారు. స్థానిక ఆలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయ ఈఓ దర్గయ్యతో కలిసి మాట్లాడుతూ 1850వ సంవత్సరానికి పూర్వమే ఈ ఆలయానికి చైర్మన్లుగా కాటంరెడ్డి వంశీయులు పెద్ద సుబ్బారెడ్డి, రంగారెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి వ్యవహరించినట్లు తెలియజేశారు. దేవస్థానం అభివృద్ధికి వారు పూర్తిస్థాయిలో సహకరించారన్నారు. ప్రస్తుతం ఈ ఆలయానికి వారి వంశీయులైన కాటంరెడ్డి కృష్ణారెడ్డి చైర్మన్‌గా ఉంటూ వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించినట్లు వివరించారు. ప్రస్తుతం ఈ ఆలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుందన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌స్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు పోలుదారు వెంకట నాగసునీల్, పూనూరు వెంకటేశ్వర్లురెడ్డి, బుజ్జమ్మ, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంపూర్ణ ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

తోటపల్లిగూడూరు : ప్రతి పేదవాడికి సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత టంగుటూరు పద్మనాభరెడ్డి అన్నారు. మండలంలోని ఈదూరు సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపు శుక్రవారం జరిగింది. ఈ క్రమంలో ఈదూరు సచివాలయ పరిధిలోని ఈదూరు, మండపం పంచాయతీలకు చెందిన దాదాపు 420 మందికి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం పద్మనాభరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ టంగుటూరు శ్రీలక్ష్మి, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ హేమలత, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 'నా భూమి- నా దేశం'



కోవూరు : స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ ఎ.మహేంద్రరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించి ఒక కలశంలో వేసి ఢిల్లీకి పంపేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానంగా యువతలో అంతరించిపోతున్న నైతిక విలువలను పూర్తిస్థాయిలో పెంచేందుకే ప్రభుత్వాలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పరుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, ఎంపీడీఓ శ్రీహరి, సర్పంచ్‌లు లక్ష్మీకుమారి, విజయ, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అదనపు కట్నం కోసం భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన రేబాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం రేబాల గ్రామానికి చెందిన ఈదూరు నవీనకు విడవలూరు మండలం దండిగుంటకు చెందిన ఈదూరు శ్రీనివాసులుతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మద్యానికి బానిసైన శ్రీనివాసులు తరచూ భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధించేవాడు. దీనిని భరించలేక నవీన ఈనెల 10న రేబాలలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో భార్యపై కక్ష పెంచుకున్న శ్రీనివాసులు ఈనెల 15న భార్య ఇంట్లో నిద్రిస్తుండగా కత్తితో మెడపై నరకబోయాడు. వెంటనే తేరుకున్న నవీన భర్తను అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమె చేతికి తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు బుచ్చిరెడ్డిపాళెంలోని వైద్యశాలలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బుచ్చిరెడ్డిపాళెం ఏఎస్సై విశ్వనాథ్ తెలిపారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సరస్వతీదేవిగా కామాక్షితాయి అమ్మవారు



పొదలకూరు : సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి



పొదలకూరు : అమ్మవారికి వెన్నాభిషేకం



మనుబోలు : పోలేరమ్మ ఆలయంలో..

చదువుల తల్లీ.. నమోస్తుతే

- సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో చిన్నారులకు విద్యాసామగ్రిని అందజేశారు. నారాయణ, అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత వస్త్ర సంస్థ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ, విద్యాసామగ్రి దాతలు ఎల్.శ్రీమన్నారయణ, బీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

పొదలకూరు : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం లలిత సహస్రనామార్చన, ఖడ్గమాల, సరస్వతి వెండిప్రతిమలు, బంగారు కాసులు, గుండ్లను వేలంపాట వేశారు.

అమ్మవారికి అభిషేకం

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని భక్తులు వెన్నతో అభిషేకించారు. సాయంత్రం పుష్పాలు, మల్లెపూలతో అర్చన గావించారు.

సామూహిక కుంకుమ పూజలు

పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి(శివాలయం) ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున దేవస్థానం ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



ఇందుకూరుపేట : చాముండేశ్వరీదేవి ఆలయంలో..



పొదలకూరు : సామూహిక కుంకుమ పూజలో భక్తులు

మనుబోలు మండల కేంద్రంలో..

మనుబోలు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మనుబోలు మండల కేంద్రంలో అమ్మవారు శుక్రవారం రాత్రి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోదండ రామపురంలోని పోలేరమ్మ ఆలయం, దసరా చావిడి వద్ద అర్చకులు శ్రీనివాసులు, హరికృష్ణ అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆరూరు అనిల్‌కుమార్‌రెడ్డి అనిత, వల్లూరు భాస్కర్‌రెడ్డి, సుజనమ్మ దంపతులు వ్యవహరించారు.

మహాసరస్వతీదేవిగా అమ్మవారు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ఉన్న చాముండేశ్వరీదేవి అమ్మవారు మహా సరస్వతీదేవిగా భక్తులను కటాక్షించారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు అనిల్ స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలకు స్థానికులు కేతిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, సంధ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

- ఇందుకూరుపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారికి పల్లకిసేవ వేడుకగా జరిగింది. అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయకర్తగా తాటిపర్తి మనోహర్‌రెడ్డి వ్యవహరించారు.
- మైపాడులోని అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, పల్లకిసేవ జరిగింది. అర్చకులు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్థానికులు బండి జనార్దన్‌రెడ్డి, హరితమ్మ ఉభయదాతలుగా వ్యవహరించారు.
- పల్లిపాడులోని మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చింతపంటి రాజేంద్ర, మల్లేశ్వరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యాసామగ్రిని అందజేస్తున్న దాతలు

చాముండేశ్వరీదేవికి పూజలు

పొదలకూరు : పట్టణంలోని దేవాంగ వీధిలో ఉన్న చాముండేశ్వరి ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా కొండా సుబ్బారెడ్డి దంపతులు వ్యవహరించారు. దేవస్థానాన్ని ప్రత్యేకంగా పూలాలంకరణ చేశారు. అమ్మవారు కాళీమాతగా దర్శనం ఇచ్చారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- డీపీఎం కామాక్షి



మాట్లాడుతున్న డీపీఎం కామాక్షి

మనుబోలు : పొదుపు మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ డీపీఎం కామాక్షి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో గ్రామ అధికార పునరుద్ధరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం కామాక్షి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. పొదుపు మహిళలు గ్రూపుల ద్వారా తీసుకున్న రుణాలకు సంబంధించి క్రమం తప్పకుండా తమ వాటా నగదు చెల్లించాలని వివరించారు. పీహెచ్‌సీ డాక్టర్ గేయపూజిత మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఎస్సై అజయ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఎం వనజాక్షి, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ నాగార్జున, సంఘ బంధ అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు తోటపల్లిగూడూరుకు మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం మండలంలో పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ హేమలత శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు తోటపల్లిగూడూరు పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభిస్తారన్నారు. అనంతరం చింతోపు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరవుతారని తెలియజేశారు.

గ్రామాల్లో ప్రగతి పరుగులు



సిమెంట్ రోడ్లకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలో రూ.1.14 కోట్లతో నిర్మించిన సీసీరోడ్డును ఎమ్మెల్యే ప్రసన్న శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రామచంద్రాపురం గ్రామ పంచాయతీకి సంబంధించి పాతూరులో రూ.17.30 లక్షలను అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలియజేశారు. అదేవిధంగా కొత్తూరులో రూ.34 లక్షలతో సీసీరోడ్లు, నూతన విద్యుత్ లైన్లను ప్రారంభించినట్లు తెలిపారు. లక్ష్మీపురంలో రూ.25 లక్షలతో రోడ్లను వేశామని, వెంకటనారాయణపురంలో రూ.18 లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే రవీంద్రపురంలోని సీసీరోడ్డుకు రూ.4.50 లక్షలు వెచ్చించామని, ప్రశాంతగిరిలో రూ.10 లక్షలతో రోడ్లు వేశామన్నారు. ఇలా ప్రతి గ్రామంలో రోడ్లు వేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్షయ్య, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, పార్టీ నేతలు పాశం శ్రీహరిరెడ్డి, ఆవుల వాసు, ఓగు నాగేశ్వరావు, మత్స్యకార నాయకులు బుచ్చింగారి తిరుపతయ్య, ఆవుల రవీంద్ర, వెంకటరమణయ్య, ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జ్వాలాముఖి ఆలయాభివృద్ధికి కృషి

- రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నవరాత్రులను పురస్కరించుకుని వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయాన్ని మంత్రి కాకాణి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రికి ఆలయ చైర్మన్ కోసూరు రవీంద్రయ్యతో పాటు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ క్రమంలో ఆయన అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరినట్లు తెలిపారు. స్థానిక నేతలు విష్ణుమోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్యామలమ్మ, సునీల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, హరి, ఈఓ శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న మంత్రి కాకాణి

పోలీసులకు సన్మానం

కొడవలూరు : సమర్థవంతంగా విధులు నిర్వహించి బదిలీ అయిన పోలీసు అధికారులకు నార్తురాజుపాళెం వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన కొడవలూరు ఎస్సై జి.సుబ్బారావు, కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డితో పాటు బుచ్చి సీఐగా పనిచేస్తున్న జి.రామారావులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు బి.సుప్రియ, నల్లావుల శ్రీనివాసులు, మారంరెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందుకుంటున్న ఎస్సై సుబ్బారావు

ప్రజలకు చేరువై పథకాలను వివరించండి



సచివాలయ కన్వీనర్లకు పార్టీ సామగ్రిని అందజేస్తున్న మంత్రి కాకాణి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువై వారికి అందిన ప్రభుత్వ పథకాలను వివరించాలని, గతం కంటే మిన్నగా మెజారిటీని సాధించి పెట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కేసీఆర్ఎస్ కల్యాణ మండపంలో జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి' కార్యక్రమంలో భాగంగా మండల కార్యకర్తలు, నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ మళ్లీ అధికారంలో వైఎస్సార్‌సీపీ వస్తుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాల్సిందిగా సూచించారు. నాలుగు అంశాలపై మండల స్థాయి నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రతి ఇంటిపై పార్టీ జెండా రెపరెపలాడే విధంగా పనిచేయాల్సిందిగా పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించే బాధ్యతను తాను స్వీకరిస్తానన్నారు. వీలైనన్ని పర్యటనలకు తాను వ్యక్తిగతంగా హాజరవుతానన్నారు.

మైండ్‌గేమ్ ఆడుతున్న సోమిరెడ్డి

ఆడలేక మద్దెలవోడు అన్న చందంగా సోమిరెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో మైండ్‌గేమ్ ఆడుతున్నట్లు మంత్రి కాకాణి విమర్శించారు. ఏ మండలానికి వెళ్లినా పక్క మండలంలో తనకు బాగుందని అబద్ధాలు చెప్పుకుంటున్నట్లు తెలిపారు. సోమిరెడ్డికి మళ్లీ ఓటమి తప్పదని, అన్నిరకాల సర్వేలు అదే చెబుతున్నట్లు తెలిపారు. తాను హ్యాట్రిక్ సాధించడం ఖాయమని, సర్వేపల్లి ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలతారెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన సుబ్బయ్య

టీడీపీ నేత వైఎస్సార్‌సీపీలో చేరిక

ఇనుకుర్తి పంచాయతీలో తెలుగుదేశం పార్టీలో కీలక నేతగా కొనసాగుతున్న సర్వేపల్లి సుబ్బయ్య శుక్రవారం మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, అక్కెం రామకోటారెడ్డి, ఎనిమిరెడ్డి పెంచలరెడ్డి ఉన్నారు.

వీర జవాన్లను ఆదర్శంగా తీసుకోవాలి



రిటైర్డ్ జవాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కోవూరు : విధి నిర్వహణలో అశువులు బాసిన వీర జవాన్లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నా భూమి- నా దేశం కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొనాలని కోరారు. తొలుత బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పరుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద శుక్రవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన మహేష్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వస్తుండగా, కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మహేష్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.